సాక్షి
కుమురం భీం

సోమవారం ౹ 4 ౹ మార్చి ౹ 2024



వినూత్నంగా బోధన

లేండిగూడ ప్రాథమిక పాఠశాలలో వినూత్న పద్ధతుల్లో విద్యాబోధన చేస్తున్నారు. విద్యార్థుల్లో జనరల్ నాలెడ్జ్ పెంచేందుకు టీచర్లు కృషి చేస్తున్నారు. 9లో▸



రైల్వే ప్రయాణికులకు ఊరట

కరోనా సమయంలో పెంచిన చార్జీలను రైల్వేశాఖ రద్దు చేసింది. ప్యాసింజర్, పుష్‌పుల్ రైలు ప్రయాణికులకు ఆర్డినరీ చార్జీలను పునరుద్ధరించింది. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.5 /21.4

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. కొంతమేర మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. చలి ప్రభావం పూర్తిగా తగ్గుతుంది.

మోదీపై ఆశలు



- నేడు ఆదిలాబాద్‌కు ప్రధానమంత్రి
- ఉమ్మడి జిల్లాపై వరాలు కురిపించేనా?
- ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేనా..
- ఎయిర్‌పోర్టు.. లేదంటే విమానయాన శిక్షణ కేంద్రం ఏర్పాటుపై తేల్చేనా
- తాజాగా ఐఐహెచ్‌టీ ఉమ్మడి జిల్లాకు కేటాయించాలనే డిమాండ్
- సింగరేణి కార్మికులకు ఆదాయపన్ను మినహాయింపుపై స్పందించేనా..



ప్రధానమంత్రి మోదీ పాల్గొనే బహిరంగ సభ వేదిక ఏర్పాట్లు

సాక్షి,ఆదిలాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం ఆదిలాబాద్‌కు విచ్చేయనున్నారు. అధికారిక కార్యక్రమాలతో పాటు పార్టీపరంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొననున్నారు. పీఎం రాక నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రధానంగా పలు ప్రాజెక్టులకు సంబంధించి కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాకపోవడం, పూర్తిస్థాయిలో నిధులు సమకూర్చకపోవడంతో అనేక నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయి. పలు ప్రతిపాదనలకు ఏళ్లుగా మోక్షం లభించడం లేదు. ఈ క్రమంలో ఈ ప్రాంతవాసులు ప్రధాని ప్రకటించే వరాలపై ఆశగా ఎదురుచూస్తున్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు..

మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్, రెబ్బెన రైల్వేస్టేషన్లు ప్రస్తుతం సౌత్ సెంట్రల్ రైల్వే (ఎస్‌సీఆర్) డివిజన్ పరిధిలో ఉన్నాయి. వీటిని కలిపికాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఏళ్లుగా డిమాండ్ ఉంది. తద్వారా ఇతర సెక్షన్ రైల్వే మార్గాలతోటి అనుసంధానం పెరిగి ప్రయాణ సౌకర్యం పెరుగుతుందన్న అభిప్రాయం ఉంది. ఆర్మూర్-జగదల్‌పూర్ వయా మంచిర్యాల ఎన్‌హెచ్ 63కి సంబంధించి నిర్మాణంలో తీవ్రజాప్యం జరుగుతుంది. భూసేకరణ త్వరితగతిన పూర్తిచేసి నిధులు మంజూరు చేస్తే ఇది నిర్మాణానికి నోచుకుంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇదే రోడ్డుకు సంబంధించి మంచిర్యాలలో బైపాస్ నిర్మాణంలోనూ జాప్యం చోటు చేసుకుంటుంది. దీనికి సంబంధించి నిధులు విడుదల చేయాలనే డిమాండ్ స్థానికుల నుంచి వ్యక్తమవుతుంది. బెల్లంపల్లి-గడ్చిరోలి మధ్య కొత్త హైవే నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలకే పరిమితమైంది. మంచిర్యాల-బల్లార్షా,మంచిర్యాల-కాజీపేట-వరంగల్‌ల మధ్య కొత్త ప్యాసింజర్ రైళ్లు మంజూరు చేయాలని ఏళ్లుగా డిమాండ్ ఉంది. వాటికి మోక్షం కలగడం లేదు. కరోనా సమయంలో సూపర్‌ఫాస్ట్ రైళ్ల హాల్టింగ్ నిలుపుదల చేయడంతో మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్, రెబ్బెన ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరిగి ఈ రైళ్లను పునరుద్ధరించాలని డిమాండ్ వ్యక్తమవుతుంది. కవ్వాల్ టైగర్ రిజర్వులో పులు లకదలిక అంతగా లేకపోవడంతో ఆంక్షలను సడలించాలనే డిమాండ్ గిరిజనుల నుంచి వ్యక్తమవుతుంది. ఈవిషయంలో కేంద్రం నుంచి ఏదైన కీలక నిర్ణయం వెలువడుతుందా అని ఎదురుచూస్తున్నారు.


సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను విషయంలో..

సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను మినహాయించాలని గతంలో రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. ఈ భారాన్ని కోల్ ఇండియా భరించాలని కోరింది. అయితే కేంద్రం నుంచి ఎలాంటి చొరవ లేకపోవడంతో కార్మికుల్లో నిట్టూర్పు వ్యక్తమవుతోంది. ఈ విషయంలో ప్రధాని ఏదైనా ప్రకటన చేస్తారా అని ఎదురుచూస్తున్నారు.

ఐఐటీహెచ్ ఏర్పాటు చేయాలి..

గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన వర్సిటీ ఏర్పాటు చేస్తారని ఆశించినప్పటికీ చివరికి అది ములుగుకు కేటాయించారు. ఇలా ఉమ్మడి జిల్లాపై చిన్నచూపు చూశారన్న విమర్శ ఉంది. తాజాగా కేంద్రం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)ని రాష్ట్రానికి మంజూరు చేసింది. దీన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది. ప్రధాని నుంచి దీని విషయంలో స్పష్టత రావాలని, ఈ దిశగా జిల్లా బీజేపీ నేతలు ఒత్తిడి తీసుకురావాలనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఐఐహెచ్‌టీలో రెగ్యులర్ శిక్షణతో పాటు టెక్నికల్ టెక్స్‌టైల్‌కు సంబంధించిన చదువులు, టెక్స్‌టైల్, దుస్తుల డిజైన్, మార్కెటింగ్, అంతర్జాతీయ వర్తకంవంటి అంశాల్లో బోధన అందనుంది. జౌళి పరిశ్రమ మరింతగా అభివృద్ధి చెందడానికి దోహదపడుతుందన్న అభిప్రాయం ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్‌లో పత్తి పంట డిమాండ్ అధికంగా ఉంది. ఈ క్రమంలో ఈ చేనేత సాంకేతికత విద్యా సంస్థను కేటాయించాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది.

ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్‌పై..



ఆదిలాబాద్ రైల్వే స్టేషన్

ఆదిలాబాద్-నిర్మల్-ఆర్మూర్ మీదుగా పటాన్‌చెరు వరకు నిర్మించే రైల్వే మార్గంపై ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లావాసుల దశాబ్దాల కల. కొద్ది నెలల క్రితం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదిలాబాద్-పటాన్‌చెరు ప్రణాళిక సిద్ధమని ప్రకటించారు. 317 కిలోమీటర్ల పరిధిలో నిర్మించే ఈ ప్రాజెక్టుకు సంబంధించి రూ.5,706 కోట్లు అంచనా వ్యయంగా పేర్కొన్నారు. తుది సర్వే సైతం పూర్తయిందని ఇటీవల బీజేపీ నేతలు స్పష్టం చేస్తూ వస్తున్నారు. దీనికి సంబంధించి ప్రధాని స్పష్టమైన హామీ ఇస్తారా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. బెంగళూరు-నాందేడ్, పూణే-నాందేడ్ మధ్యలో నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆదిలాబాద్ వరకు పొడిగించాలనే డిమాండ్ ఉంది. దేశంలో రెండో సిలికాన్ సిటీ అయిన పూణేకు రైల్వే మార్గం ఏర్పడితే ఈ ప్రాంత యువతకు సౌకర్యంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. కాజీపేట-ఆదిలాబాద్ మధ్యలో, నాగ్‌పూర్-ఆదిలాబాద్ మధ్యలో ఇంటర్‌సిటీ కొత్త రైళ్లను ప్రవేశపెట్టాలనే డిమాండ్ కూడా ఉంది. వీటికి సంబంధించి ఆదిలాబాద్ పౌర సమాజం సభ్యులు పలుమార్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులకు వినతి పత్రాలు అందించారు.

సీసీఐ పునరుద్ధరణపై..



మూతపడ్డ సీసీఐ ఫ్యాక్టరీ

ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని ఈ ప్రాంతంలో డిమాండ్ ఉంది. ఈ యూనిట్‌ను పునరుద్ధరిస్తే తెలంగాణ అవసరాలకే కాకుండా మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా సిమెంట్ సరఫరా చేసేందుకు వీలవుతుందని గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

ఎయిర్‌పోర్ట్ లేనిపక్షంలో ఎయిర్‌ఫోర్స్..



విమానాశ్రయ మైదానం

ఆదిలాబాద్‌లో 360 ఎకరాల విస్తీర్ణంలో రక్షణ శాఖ భూమి ఉంది. దీన్ని విమానాశ్రమ మైదానంగా పేర్కొంటున్నారు. సోమవారం ప్రధానమంత్రి మోదీ హెలికాప్టర్ కూడా ఇదే మైదానంలో దిగనుంది. కాగా ఇక్కడ ఎయిర్‌పోర్ట్ లేనిపక్షంలో విమానయాన శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఏళ్లుగా ఉంది. గతంలో పలు సర్వేలు జరిగినప్పటికీ వీటిలో ఏది సాకారం కాలేదు. మధ్యలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎయిర్‌స్ట్రిప్ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. దానికి కూడా మోక్షం లభించలేదు. తాజాగా ప్రధాని ఇక్కడికి రానుండడంతో దీనిపై ఏదైన కదలిక వస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది.

నేడు గవర్నర్ రాక..

కైలాస్‌నగర్: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ సోమవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈమేరకు ఆమె పర్యటనకు సంబంధించిన అధికారిక షెడ్యూల్ విడుదలైంది. ప్రధాని నరేంద్రమోదీకి సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి స్వాగతం పలకనున్నారు. అలాగే జిల్లా కేంద్రంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించి ప్రధాని శంకుస్థాపన చేసే కార్యక్రమాల్లో పాల్గొంటారని గవర్నర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

సీఎం రేవంత్‌రెడ్డి సైతం..

సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 4న ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి రానున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8గంటలకు హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 9గంటలకు ఆదిలాబాద్ చేరుకుంటారని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి 11.15 గంటల వరకు స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ప్రధాని మోదీతో కలిసి వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేస్తారని తెలిపారు. తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు ఆదిలాబాద్ నుంచి ముఖ్యమంత్రి బయలుదేరి వెళ్తారని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

క్రీడలతో ఐకమత్యం



విజేత జట్టుతో ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: క్రీడలతో ఐకమత్యం పెరుగుతుందని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్రీడాపోటీలు ఆదివారం ముగిశాయి. క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో ఆర్మ్‌డ్, స్పెషల్ పార్టీ పోలీసు టీంలు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన స్పెషల్ పార్టీ టీం నిర్ణీత 15 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆర్మ్‌డ్ పోలీసు టీం 15 ఓవర్లలో 116 పరుగులకే పరిమితం కావడంతో స్పెషల్ పార్టీ జట్టు 45 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఫైనల్‌కు చేరిన ఇరుజట్లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు త్వరలో హెడ్‌క్వార్టర్‌లో జరిగే కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ సదయ్య, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తనమూనాలు సేకరించాలి



రికార్డులు పరిశీలిస్తున్న సుధాకర్‌నాయక్

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని గ్రామాల్లో ఎన్‌సీడీ రోగుల నుంచి రక్తనమూనాలు సేకరించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆదివారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లో చాలా మంది బీపీ, క్షయ, షుగర్ తదితర వ్యాధులతో బాధపడుతున్నారని, అలాంటి వారి వివరాలు సేకరించాలని సూచించారు. వైద్యసిబ్బంది రెండు రోజులపాటు ఇంటింటికీ తిరుగుతూ చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. ఆయన వెంట ఫార్మసిస్ట్ ఖలీల్ హుస్సేన్, సిబ్బంది ఉన్నారు.

ప్రశాంతంగా అర్హత పరీక్ష



పరీక్ష కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కన్వీనర్ వెంకటప్రసాద్

ఆసిఫాబాద్‌రూరల్: మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి నిర్వహించిన పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. 6, 7, 8వ తరగతుల్లో మిగిలిపోయిన బ్యాక్‌లాగ్ ఖాళీల కోసం జిల్లా వ్యాప్తంగా 2,138 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని ఎంజేపీ పాఠశాలల కన్వీనర్ వెంకటప్రసాద్ తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి 1086 మంది విద్యార్థులకు 1001 మంది హాజరు కాగా.. 7వ తరగతిలో సీటు కోసం 594 మందికి 549 మంది, 8వ తరగతి కోసం 458 మంది 425 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. మొత్తం 2053 మందికి 85 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

కరాటేలో గంగాపూర్ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో మాస్టర్ కుమార్

రెబ్బెన(ఆసిఫాబాద్): మందమర్రిలో ఆదివారం నిర్వహించిన కరాటే పోటీల్లో మండలంలోని గంగాపూర్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారని మాస్టర్ చాపిడి కుమార్ తెలిపారు. గంగాపూర్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన శశి కటాస్ విభాగంలో బంగారు పతకం సాధించగా, ఎస్.సంజయ్ వెండి పతకం, రాంచరణ్, రిక్షత, పూజిత కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలన్నారు.

పోలియో రహిత సమాజానికి కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



జైనూర్‌లో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్/జైనూర్: పోలియో రహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం జైనూర్ మండల కేంద్రంలో డీఎంహెచ్‌వో తుకారాంతో కలిసి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు విధిగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం మాట్లాడుతూ జిల్లాలో 57,362 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా, తొలిరోజు 5,3218 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. 92.7 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశామన్నారు. సోమవారం గడపగడపకూ వెళ్లి పోలియో చుక్కలు వేస్తామని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, ఎంపీడీవో ప్రభుదయ, పంచాయతీరాజ్ ఏఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు అడ్డుకున్న అటవీ అధికారులు

చింతలమానెపల్లి(సిర్పూర్): చింతలమానెపల్లి మండలం కోర్సిని గ్రామంలో రోడ్డు పనులను అటవీశాఖ అధికారులు ఆదివారం అడ్డుకున్నారు. ఉపాధిహామీ పథకం కింద మంజూరైన రూ.15లక్షల నిధులతో రహదారి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పనులు ప్రారంభించారు. సమాచారం అందుకున్న అటవీ అధికారులు గ్రామానికి చేరుకుని పనులు నిలిపివేయాలని ఆదేశించారు. సిమెంట్ మిక్సర్ యంత్రం యజమానిని అటవీ అధికారులు బెదిరించడంతో డ్రైవర్, సిబ్బంది వెళ్లిపోయారని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామంలో గతంలో రైతువేదిక నిర్మించినా, పాఠశాలలో పనులు చేపట్టినా అడ్డుకోని అధికారులు.. ప్రస్తుతం గ్రామస్తులకు ఉపయోగపడే రహదారి పనులను ఎలా అడ్డుకుంటారని స్థానిక ఎంపీటీసీ రోజా ప్రశ్నించారు. చేతి పంపులు, డ్రెయినేజీలు, మౌలిక వసతుల కల్పన పనులను ఇలా అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు.

దివ్యాంగులకు ఐదు శాతం కేటాయించాలి



సదస్సులో మాట్లాడుతున్న అడివయ్య

కాగజ్‌నగర్‌రూరల్: ప్రభుత్వ పథకాల అమలులో ఐదుశాతం దివ్యాంగులకు కేటాయించాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని బాలభారతి పాఠశాల ఆవరణలో ఆదివారం జిల్లా గౌరవ అధ్యక్షుడు ముంజం ఆనంద్‌కుమార్ అధ్యక్షతన వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వికలాంగుల చట్టాలు- సంక్షేమ పథకాలు అనే అంశంపై జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. అడివయ్య మాట్లాడుతూ వైకల్యం కలిగిన విద్యార్థులకు గుర్తించేందుకు ఐదేళ్లకు ఒకసారి సర్వే చేయాలని 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం సెక్షన్ 17(ఎ) పేర్కొంటుందని, అయినా ఎక్కడా సర్వేలు చేపట్టడం లేదన్నారు. పంచాయతీల్లో అంగన్‌వాడీ, ఆశ వర్కర్ల ద్వారా వికలాంగుల సమగ్ర సమాచారం సేకరించాలన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 10.48 లక్షల మంది వికలాంగులు ఉన్నారని, తెలంగాణ దిశ బెల్ట్ స్టడీ ఇండియా రిపోర్టు ప్రకారం 43.02 లక్షల మంది ఒకటి కంటే ఎక్కువ వైకల్యాలతో బాధపడుతున్నారని వివరించారు. రాష్ట్ర జనాభాలో 12.2 శాతం దివ్యాంగులున్నా రాజకీయ పార్టీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. పెన్షన్ రూ.6 వేలకు పెంచి ఉచిత విద్యుత్, ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సదస్సులో నాయకులు ప్రదీప్ మండల్, రాజేశ్, రాజయ్య, అశోక్, జాకీర్, లక్ష్మి, సంతోష్, ప్రమీల, లక్ష్మి, వెంకటేశ్, సప్తగిరి, రమేశ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మార్చిలోనే ఎండలు!

- జిల్లాలో పెరిగిన భానుడి భగభగలు
- 40 డిగ్రీలకు చేరువలో పగటి ఉష్ణోగ్రతలు
- రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం
- జ్యూస్‌లు, ఐస్‌క్రీంలకు పెరిగిన గిరాకీ



ఆసిఫాబాద్‌లో జ్యూస్ సెంటర్ వద్ద జనం

తిర్యాణి(ఆసిఫాబాద్): మార్చిలోనే వేసవి వేడి మొదలైంది. మహాశివరాత్రికి ముందే పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. జనవరి 28న సిర్పూర్(యూ) మండలంలో కనిష్ట ఉష్ణోగ్రత 8.7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. చలి ప్రభావం జిల్లా అంతటా కనిపించింది. నెల గడిచిన తర్వాత వాతావరణం పూర్తిగా మారిపోయాయి. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరవ కాగా.. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా 20 డిగ్రీలు దాటుతున్నాయి.

చలి, ఎండ.. రెండూ ఎక్కువే..

అడవుల జిల్లాగా పేరున్న కుమురంభీం ఆసిఫాబాద్‌లో భిన్న పరిస్థితులు కనిపిస్తాయి. చలికాలంలో కనిష్ట ఉష్ణోగ్రతలు పది డిగ్రీల లోపే నమోదవుతాయి. అలాగే వేసవి వచ్చేసరికి పరిస్థితులు మారిపోతాయి. అడవుల్లో ఆకులు రాలి పచ్చదనం కనిపించకుండా పోతుంది. ఫలితంగా ఎండ వేడి కూడా అధికంగా ఉంటుంది. మార్చి, ఏప్రిల్, మే నెలలతో పాటు జూన్‌లో రుతుపవనాల ప్రభావంతో వర్షాలు వచ్చేవరకు ఎండ తీవ్రత కనిపిస్తోంది. అకాల వర్షాలతో రెండు, మూడు రోజులపాటు వాతావరణం చల్లబడినా మళ్లీ భానుడు ప్రతాపం చూపిస్తాడు.

ఆదివారం 38.2 డిగ్రీలు..

జిల్లాలో ఆదివారం 38.2 డిగ్రీల సెల్సియస్‌గా పగటి ఉష్ణోగ్రత నమోదైంది. నాలుగు రోజులు ఎండ ఎక్కువగా ఉండటంతో జిల్లా కేంద్రంలో ప్రధాన చౌక్‌లు పగటి పూట నిర్మానుష్యంగా మారింది. మరోవైపు పెళ్లిళ్ల సీజన్ కావడంతో జ్యూస్‌లు, కొబ్బరిబోండాలు, ఐస్‌క్రీంలకు గిరాకీ పెరిగింది. ఉపాధిహామీ కూలీలు ఉదయం 9, 10 గంటల లోపు పనులు పూర్తి చేసుకుంటున్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరగడంతోపాటు వడగాడ్పులు వీచే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే భూగర్భ జలాలు ప్రమాదకరస్థాయిలో పడిపోతున్నాయి. వాగులు, చెరువుల్లో నీటి వనరులు ఎండిపోతుండటంతో పశువులు తాగునీటికి తండ్లాడుతున్నాయి.

జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు

తేదీ	ఉష్ణోగ్రత(డిగ్రీలలో)
ఫిబ్రవరి 29	37.9
మార్చి 01	36.6
మార్చి 02	38.0
మార్చి 03	38.2

జాగ్రత్తలు అవసరం

- ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేయాల్సి వస్తే వేడి గాలి తగలకుండా తలకు కాటన్ టవల్, కర్చీఫ్ కట్టుకోవాలి. కళ్లకు అద్దాలు ధరించాలి.
- శరీరం డీహైడ్రేట్ బారిన పడకుండా తరచూ నీళ్లు, పళ్ల రసాలు తీసుకోవాలి.
- త్వరగా జీర్ణమయ్యే తేలికపాటి ఆహారం, పండ్లు, కూరగాయలు భోజనంలో ఉండేలా చూసుకోవాలి.
- శరీరాన్ని పట్టుకునే దుస్తులు కాకుండా వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించడం ఉత్తమం. ఉక్కపోత నుంచి ఉపశమనం పొందే వీలుంటుంది.
- సూర్య కిరణాలతో చర్మం పాలిపోయే అవకాశం ఉన్నందున సన్ స్క్రీన్ లోషన్లు వాడాలి.

బతుకు 'బండి'

ఆసిఫాబాద్‌అర్బన్: మహాలక్ష్మి పథకంతో ఆటోలకు గిరాకీ తగ్గిపోవడంతో డ్రైవర్లు చాలా మంది ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ శంకర్ తన తల్లి కౌసల్యతో కలిసి సరికొత్త ఆలోచన చేశాడు. ఆటోలోనే కూరగాయలు, ఇతర సామగ్రిని వేసుకుని చుట్టుపక్కల గ్రామాల్లో తిరుగుతూ విక్రయిస్తున్నాడు. ఖర్చులు పోగా.. రూ.1000 వరకు ఆదాయం వస్తోందని తెలిపాడు. డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.



క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టుకున్న టాస్క్‌ఫోర్స్

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో 40క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారి వివరాల ప్రకారం... దేవాపూర్ చుట్టుపక్కల గ్రామాల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన పీడీఎస్ బియ్యాన్ని దేవాపూర్‌లో షేక్ నైమ అనే వ్యక్తి ఇళ్లు అద్దెకు తీసుకుని అందులో ఉంచినట్లు సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్సై లచ్చన్న ఆధ్వర్యంలో దాడి చేశారు. బియ్యాన్ని మండలంలోని ముత్యంపల్లికి చెందిన ఎండీ తాజోద్దీన్‌కు చెందినవిగా గుర్తించారు. సుమారుగా 40క్వింటాళ్ల బియ్యాన్ని విచారణ నిమిత్తం దేవాపూర్ పోలీసులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శ్రీధర్, శ్రీను, రాజు, రాకేష్ ఉన్నారు.

మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకోవాలి

పాతమంచిర్యాల: మార్చి 08న ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఎం.జ్యోతి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్‌భవన్‌లో ఆదివారం మహిళలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమాజంలో సగభాగమైన మహిళలు హక్కుల కోసం, సమానత్వం కోసం లింగవివక్షకు వ్యతిరేఖంగా పోరాడాలని గుర్తు చేసే రోజు మార్చి 8 అన్నారు. బానిస బతుకులు వెట్టిచాకిరి సంకెళ్లను తెంచి పరిశ్రమల్లో పని చేసే మహిళా కార్మికులు తమ హక్కులు పోరాడి సాధించుకున్న సందర్భంగా మార్చి 08 మహిళా లోకానికి ఉద్యమాల కరదీపికగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ, మహేశ్వరీ, రాజేశ్వరీ, శ్యామల, మంగ ఉన్నారు.

విప్లవపార్టీల విలీన సభకు బయలుదేరిన నాయకులు

పాతమంచిర్యాల: ఖమ్మం పట్టణంలో మార్చి3, 4, 5 తేదీల్లో నిర్వహించే విప్లవ పార్టీల విలీన సభకు జిల్లా కేంద్రం నుంచి సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ నాయకులు ఆదివారం బయలుదేరారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ మాట్లాడుతూ భారత దేశంలోని 18 రాష్ట్రాల మూడు విప్లవ పార్టీలు ఏకమతున్నాయని, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ, పీసీసీ సీపీఐఎంఎల్, సీపీఐ రెవెల్యూషనరీ పార్టీలు కలిసి ఒకే విప్లవ పార్టీ సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్‌గా ఆవిర్భవించబోతున్నాయని తెలిపారు. మూడు విప్లవ పార్టీల కలయిక దేశ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోనుందన్నారు. సభకు బయలుదేరిన వారిలో సీపీఐఎంఎల్ ప్రజాపంథా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పురంశెట్టి బాబు, చింతపురి బాపురావు, శ్రీకాంత్, సురేష్, ఏదుల సుగుణ ఉన్నారు.

PUBLIC NOTICE

The general public are hereby informed that my client, Mr. Shaik Javeed Pasha, S/o. Shaik Mohammed, Aged 26 years, Occ: Business, R/o. H.No. 1-4-22, Indira Market, Sirpur-Kaghaznagar, Kaghaznagar Mandal, Kumuram Bheem - Asifabad District, intending to purchase the property is described in schedule below from Sri. Sadula Satyanarayana, S/o. Late Sambaiah, Aged 41 years, Occ: Agriculture, R/o. Marthidi village of Bejjur Mandal, Kumram Bheem Asifabad Dist., as he informed to my client that he is the absolute owner and possessor of the property is described in schedule below. If any person/ Financial Institution/ Bank has any claims, intererst or objections to the above referred sale transaction, shall communicate the same to the undersigned with all the documentary evidence within (7) seven days, failing which my client shall go head with sale transaction and no claims would be tenable and entertained thereafter.

SCHEDULE OF PROPERTY

All that the land admeasuring Ac. 1-0960 gts, in Sy.No. 225, situated at Raspalli village, Kaghaznagar Mandal, Kumram Bheem - Asifabad Dist., and bounded by: **North:** Land of Anil Kumar, **South:** Road, **East:** Road, **West:** Land in Sy.No. 226.

Sirpur-Kaghaznagar
Date: 03-03-2024 Sd/-., **G.Ganapathi,** B.Sc., DST., LL.B., P.G.D.G.C., Advocate
C-42/B, Sirsik Colony, Sirpur-Kaghaznagar, K. B. Asifabad Dist. Cell: 9441736527

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■రెస్టారెంట్ బిజినెస్ పెట్టాలని ఉందా? ఫ్రాంచైజ్ కొరకు మా వద్ద 4 బ్రాండ్లు ఉన్నాయి. వివరాలకై సంప్రదించండి: 8328433913. [HA-2385]

■మీ బంగారం తాకట్టులో ఉందా. వడ్డీ చెల్లించలేకపోతున్నారా. ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9550606222. [H-787736]

WANTED

■ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సాప్ చేయగలరు. 9059663584. [M-1233864]



■హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ: 18k ఫోన్: 9640258899 / 9640468899 [H-793696]

■మార్చి మొదటి వారంలో అమెరికా వెళుతున్న మాకు ఇంటి, వంట పనులు చేయుటకు ఆడమనిషి కావలెను. అమెరికా విజిటింగ్ వీసా కలిగిన వారు మాత్రమే సంప్రదించగలరు. ✆ 92904 15199 [B-790486]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,

కొలువుల గురుకులం

- 8 మంది టీచర్లుగా ఎంపికైన సీఓఈ సిబ్బంది
- కానిస్టేబుల్‌గా ఎంపికైన పీఈటీ


సీఈఓ గురుకుల విద్యాలయ భవనం

బెల్లంపల్లి: విజయాలకు మారుపేరుగా నిలిచిన బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) గురుకుల విద్యాలయం మరో ఖ్యాతిని సొంతం చేసుకుంది. గురుకులంలో విద్యాబోధన చేసిన సిబ్బంది ఏకంగా ఎనిమిది మంది ప్రభుత్వ గురుకుల టీచర్లుగా ఎంపిక కాగా మరొకరు కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఇప్పటి వరకు విద్యార్థుల విజయాలతో సత్తా చాటిన సిబ్బంది ఇటీవల వెల్లడైన గురుకుల పోస్టుల ఫలితాల్లోనూ తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకుని ఆదర్శంగా నిలిచారు.

ఉద్యోగాలు సాధించిన సిబ్బంది వీరే...

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో జువాలజీ అసోసియేట్‌గా పనిచేసిన గాజుల రాజేందర్ ఏకంగా గురుకుల డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీగా ఎంపిక కాగా, బోటనీ అసోసియేట్‌గా పనిచేసిన చిలివేరు సాగర్ టీజీటీ ఉద్యోగాన్ని సాధించాడు. ఇంగ్లిష్ పార్ట్ టైం టీచర్‌గా పని చేసిన పెనుకుల శ్రావిక పీజీటీ, టీజీటీ ఇంగ్లిష్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సోషల్ పార్ట్ టైం టీచర్‌గా పనిచేసిన యల్.శ్రీనివాస్, యం.ప్రసాద్‌లు టీజీటీ సోషల్ ఉద్యోగాలను దక్కించుకున్నారు. ప్రస్తుతం టీజీటీ ఆర్ట్ టీచర్‌గా పనిచేస్తున్న బోగ అశోక్ జేఎల్ తెలుగు లెక్చరర్‌గా నియామకం కాగా పీజీటీ తెలుగు బోధిస్తున్న కోట రాజ్‌కుమార్ జేఎల్ తెలుగుకు ఎంపికయ్యారు. టీజీటీ ఇంగ్లిష్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న గణేష్ డీఎల్, జేఎల్ ఉద్యోగాలు సాధించాడు. సీవోఈలో పీఈటీగా పనిచేసిన దేవినేని శివకృష్ణ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ తీరుగా సీవోఈ గురుకులంలో పనిచేసిన, ప్రస్తుతం పనిచేస్తున్న ఎనిమిది మందికి గురుకుల ఉపాధ్యాయ ఉద్యోగాలు రావడం అరుదైన విషయం. దీంతో సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, సహచర ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

పీజీటీ, టీజీటీలో ఎంపికయ్యాను



సీఓఈ కళాశాలలో పార్ట్ టైం టీచర్‌గా పని చేశాను. విద్యార్థులకు విద్యాబోధన చేయడం వల్ల ఎన్నో అంశాల పై అవగాహన ఏర్పడింది. వివాహ అనంతరం 12 ఏళ్ల తర్వాత తిరిగి ఉపాధ్యాయురాలుగా నన్ను నేను నిలబెట్టుకున్నాను. నా భర్త సహకారంతో ప్రణాళికాబద్ధంగా చదివి పీజీటీ, టీజీటీలో ఉద్యోగాలకు ఎంపియ్యాను.

పెనుకుల శ్రావిక

సీఓఈ గురుకులం కన్నతల్లి వంటిది



నా ఉపాధ్యాయ జీవితం సీఓఈ గురుకులం నుంచి ప్రారంభమైంది. ఆ సంస్థ నాకు కన్నతల్లి వంటి ది. ప్రశాంతంగా ఉన్న నా జీవితంలో ఒక్కసారిగా యాక్సిడెంట్‌తో అల్లకల్లోలంగా మారింది. ఓ కాలును కోల్పోయాను. రెండేళ్లు మంచానికే పరి మితం అయ్యాను. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా గురుకుల ఉద్యోగాల నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేసి ప్రస్తుతం వెలువడిన ఫలితాల్లో డిగ్రీ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది.

బి.గణేష్

నాలుగు ఉద్యోగాలు సాధించాను...



సీఓఈ గురుకులంలో సబ్జెక్టు అసోసియేట్‌గా తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగంలో చేరాను. గురుకుల నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేసి స్వయంగా ప్రిపేర్ అయ్యాను. మధ్యలో మా అమ్మ అకాల మృతి చెందగా ఆ బాధను దిగమింగుకుని పట్టుదలతో చదివాను. దీంతో డిగ్రీ, జూనియర్ కళాశాల పీజీటీ, టీజీటీ నాలుగు ఉద్యోగాలు సాధించాను.

– గాజుల రాజేందర్

ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది



సీఓఈ కళాశాలలో ఆర్ట్ టీచర్‌గా పని చేస్తున్న నేను గురుకుల నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేశాను. ఆర్ట్ టీచర్‌గా పని చేస్తూనే గ్రంథాలయానికి వెళ్లి సొంతంగా చదువుకున్నాను. కొందరు మిత్రులు చేసిన సూచనలు, సలహాలను పాటించాను. జూనియర్ కళాశాల తెలుగు లెక్చరర్ గా ఉద్యోగానికి ఎంపికయ్యాను.

– భోగ అశోక్

సీఓఈ గురుకులం పట్టుదల నేర్పింది



సీఓఈ గురుకులంలో బోటనీ సబ్జెక్టు అసోసియేట్ లెక్చరర్‌గా పని చేశాను. డాక్టర్ కావడానికి విద్యార్థులకు అనేక సూచనలు, సలహాలు ఇస్తూ బోధన చేశాను. ఎప్పటికైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే కాంక్ష సీఓఈ గురుకులం నాలో మరింత పట్టుదలను పెంచింది. టీజీటీ బయాలజీ పోస్టుకు ఎంపికయ్యాను.

– సాగర్

పాఠాలు చెబుతూనే ప్రిపేర్ అయ్యాను



సీఓఈలో పార్ట్ టైం టీచర్‌గా విద్యార్థులకు సాంఘిక శాస్త్రం పాఠాలు బోధిస్తూనే మరో వైపు ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా సొంతంగా ప్రిపేర్ అయ్యాను. రెగ్యూలర్ టీచర్ రావడంతో పార్ట్ టైం ఉద్యోగాన్ని కోల్పోయాను. పట్టుదలతో చదివి టీజీటీ సోషల్ ఉద్యోగాన్ని సాధించాను. నా ఉపాధ్యాయ జీవితం ఏ గురుకులంలో ప్రారంభమైందో అదే సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థకు నన్ను కేటాయించడం మరిచిపోలేను.

– ఎల్.శ్రీనివాస్

పేదరికాన్ని జయించి ఉద్యోగం సాధించాను



సీఓఈలో సోషల్ సబ్జెక్టు బోధించాను. విద్యాబోధనలో భాగంగా ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాను. అంశాల వారీగా, ప్రణాళికాబద్ధంగా ప్రిపేర్ అయ్యాను. నా జీవితంలో అనేక ఆర్థిక ఇబ్బందులను చవిచూశాను. ఎక్కడ నిరాశ చెందకుండా టీజీటీ సోషల్ సైన్స్ పోస్టుకు ఎంపికయ్యాను.

– ఎం.ప్రసాద్

ఒకరికి జీతం.. మరొకరికి ఉద్యోగం


నాయకినిపేట సబ్‌స్టేషన్

భీమిని: కన్నెపల్లి మండలంలోని నాయకినిపేట గ్రామ పంచాయతీ పరిధిలోని సబ్‌స్టేషన్‌లో ఒకరికి బదులు మరొక్కరు విధులు నిర్వహిస్తున్నారు. సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహించే ఎండీ షమీమ్ అనే వ్యక్తి గత ఆరు నెలలుగా వేరొక్కరితో విధులు చేయిస్తూ తన జీతం నుంచి ఏడు వేల రూపాయలు ఇస్తున్నాడు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా గతంలో లైన్‌మెన్‌గా చేసిన వ్యక్తులు రిటైర్మెంట్ అనంతరం వారిని సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధుల్లోకి తీసుకున్నారు. సబ్‌స్టేషన్‌లో రోజు తరువాత రోజు ఒకరు లైన్‌మెన్, మరో ఇద్దరు ఆపరేటర్లు, మొత్తం ముగ్గురు ఆపరేటర్లు విధులు నిర్వహిస్తున్నారు. కాగా షమీమ్ అనే వ్యక్తి స్థానంలో వేరే ఒక ప్రైవేట్ వ్యక్తిని విధుల్లో పెట్టి తనకు వచ్చే రూ.20వేల నుంచి ఏడు వేలు ఇచ్చి విధులు చేయిస్తున్నాడు. ఇదంతా విద్యుత్‌శాఖ అధికారులు తెలిసినప్పటికీ మామూలుగా తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరు..?

సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్ స్థానంలో మరో ప్రైవేట్ వ్యక్తి విధులు నిర్వహిస్తున్న సమయంలో లైన్‌క్లియర్ (ఎల్‌సీ) ఇచ్చినప్పుడు కానీ, మరే కారణం చేతనైనా ప్రైవేట్ వ్యక్తి చేతిలో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ఆ శాఖ అధికారులకే తెలియాలి.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామానికి చెందిన గుర్రం నారాయణ(64) ఆదివారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుర్రం నారాయణ, లింగవ్వ దంపతులకు ముగ్గురు కూతుళ్లు. నారాయణ బర్రెల కాపరిగా జీతం ఉండేవాడు. అయితే ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. శనివారం భార్య డబ్బులు ఇవ్వకపోవడంతో రాత్రి బయటకు వెళ్లి పోచమ్మ ఆలయం వద్ద మర్రి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

మూడంచెల భద్రత


పోలీసులకు సూచనలు చేస్తున్న ఎస్పీ

- ప్రధాని పర్యటనకు భారీ బందోబస్తు
- 2వేల మంది పోలీసులు, కమెండోలు
- ఎస్పీజీ వలయంలో స్టేడియం, ఏరోడ్రమ్

ఎస్పీలు: 07, అడిషనల్ ఎస్పీలు: 07
డీఎస్పీలు: 13, సీఐలు: 40, ఎస్సైలు: 101
మహిళా ఎస్సైలు: 20,
ఏఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు: 200
కానిస్టేబుళ్లు: 700
మహిళా ఏఎస్సైలు /హెడ్‌కానిస్టేబుళ్లు: 30
మహిళా కానిస్టేబుళ్లు: 45,
హోంగార్డులు: 200,
మహిళా హోంగార్డులు: 20

కైలాస్‌నగర్: ప్రధాని మోదీ ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు పోలీస్ శాఖ మూడంచెల భద్రత ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోని 15 జిల్లాలకు చెందిన 1700 మంది పోలీసులతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. వారిని పది సెక్టార్లుగా విభజించి విధులు కేటాయించారు. స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ), గ్రేహౌండ్స్ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎస్‌డబ్ల్యూ) వంటి కేంద్ర బలగాలకు చెందిన మరో 300 మందితో రక్షణ కల్పించనున్నారు. మొత్తం 2 వేల మంది పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరు తప్పనిసరిగా ఐడీ కార్డులు ధరించడంతోపాటు తమకు కేటాయించిన ప్రాంతాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విధులు నిర్వహించేలా ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాలు జారీచేశారు.

కట్టుదిట్టమైన భద్రత

ప్రధాని రాక నేపథ్యంలో 2వేల మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నారు. జిల్లాలకు చెందిన ఏడుగురు ఎస్పీలు, ఏడుగురు అదనపు ఎస్పీలతోపాటు వివిధ కేటగిరీలకు చెందిన 1700 మంది పోలీసులను నియమించారు. ఎస్పీజీ ఆదేశాలకనుగుణంగా విధులు కేటాయించారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రధాని పాల్గొనే సభాస్థలి, హెలిప్యాడ్ ప్రాంతాల్లో డ్రోన్ల వాడకాన్ని నిషేధించారు. స్టేడియం, ఏరోడ్రమ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

ఎస్పీజీ వలయంలో..

ఏరోడ్రమ్ మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌తో పాటు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోని సభ ప్రాంగణం ఎస్పీజీ వలయంలోకి వెళ్లిపోయింది. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. డాగ్‌స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఏరోడ్రమ్ నుంచి స్టేడియం వరకు ప్రధాని ప్రత్యేక కాన్వాయ్‌లో రానున్నందున ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా చేరుకునేలా రెండుసార్లు కాన్వాయ్‌తో రిహార్సల్ నిర్వహించారు. డ్రైవర్లు, రోప్‌పార్టీ పోలీసులు, గ్రేహౌండ్స్ సిబ్బందితో ఎస్పీజీ అధికారులు సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రధాని జిల్లాకేంద్రానికి చేరుకున్నప్పటి నుంచి తిరిగి వెళ్లేవరకు అనుసరించాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. బందోబస్తుఏర్పాట్లను ఎస్పీ గౌస్ ఆలం దగ్గరుండి పర్యవేక్షించారు.

విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు

ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ప్రధాని సభాస్థలం ఉండగా, ఆ దారి గుండా ఆయా ప్రాంతాల్లో ఇంటర్ పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. కట్టుదిట్టమైన పోలీసు భద్రత ఉండడంతో ఎవరిని అనుమతించడం లేదు. కాగా విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా కేంద్రాలకు హాజరయ్యేలా పోలీసులు చూస్తున్నారు.

మృత్యువుతో పోరాడి ఓడిన యువకుడు

- గత నెల 18వ తేదీన రోడ్డు ప్రమాదం
- గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


బుర్స సుమన్(ఫైల్)

వేమనపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృత్యువుతో పోరాడి చివరకు ఒడిపోయాడు. గత నెల 18వ తేదీన చెన్నూర్ మండలం జోడువాగుల వద్ద ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు మండలంలోని రాజారాం గ్రామానికి చెందిన వలస కుటుంబాలకు చెందిన యువకులు మృత్యువు ఒడికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన రెండో రోజే నాయిని గోవర్ధన్ అనే యువకుడు మృతి చెందగా, శనివారం రాత్రి గాయపడిన మరో యువకుడు బుర్స సుమన్(20) హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇద్దరు సకాలంలో మంచి కార్పొరేట్ వైద్యం అందితే బతికే వారని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. సొంత గ్రామం రాజారాంలో పనులు దొరకక, పూటగడవక మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఇటుకబట్టీల వద్దకు కుటుంబాలు వలస వెళ్లాయి. వివాహ కార్యక్రమానికి మండల కేంద్రానికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యారు.

వైద్యం అందితే బతికే వారే

ఇద్దరు యువకులు సకాలంలో ఉన్నత వైద్యం అందితే బతికేవారు. సుమన్ గత రెండు వారాలుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడి ఓడిపోయాడు. సుమన్‌ను బతికించేందుకు తల్లిదండ్రులు మధునక్క, కిష్టయ్య, చిన్న నాన్న, పెద్దనాన్నలు ఉన్న కొద్దిపాటి భూమిని తాకట్టుపెట్టి సుమారు రూ.4.50 లక్షలు అప్పు చేశారు. కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రిలో ఖర్చు చేసిన ఫలితం దక్కలేదు. ఉన్న డబ్బులు అయిపోవడంతో ఖర్చులు తట్టుకోలేక పేద కుటుంబం హైదరాబాద్ గాంధీకి తరలించి సర్కారు వైద్యం చేయించారు. విధి వక్రీకరించి శనివారం రాత్రి సుమన్ కన్నుమూశాడు. హైదరాబాద్‌లో పోస్టుమార్టం నిర్వహించి ఆదివారం రాత్రి మృతదేహం వేమనపల్లికి తరలించారు. ఇంటికి పెద్దదిక్కైన కుమారులు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ఎంవీటీసీలో విలువైన సామగ్రి చోరీ


దొంగతనం చేసి వెళ్లేందుకు అనువైన దారి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని పాల చెట్టు సమీపంలోని గనుల వృత్తి శిక్షణ కేంద్రం (ఎంవీటీసీ) ఆవరణలో ఇటీవల విలువైన మోడల్ మెటీరియల్ (ఇనుప సామగ్రి) చోరీకి గురైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెలిసిన వివరాల ప్రకారం... సింగరేణి గనుల్లో ఉద్యోగులకు పనుల్లో భాగంగా వినియోగించే డ్రిల్ రాడ్స్, సపోర్టింగ్ రాడ్స్, హాంగ్‌లర్స్, కేబుల్ తదితర సామగ్రిని కొత్తగా ఉద్యోగంలోకి చేరిన వారికి ఎంవీటీసీలో ఇచ్చే శిక్షణలో భాగంగా చూపిస్తారు. దాని కోసం సామగ్రిని ఎంవీటీసీలోని ఒక గదిలో భద్రపరుస్తారు. గత ఏడాది ఆ గది మరమ్మతు చేయడంతో సామగ్రిని బయట ఉంచారు. అయితే గది మరమ్మతులు పూర్తయి సుమారు నెల రోజులు గడుస్తున్నా ఆ సామగ్రిని గదిలో భద్రపర్చకపోవడంతో దొంగలు ఎత్తుకెళ్తున్నారు. మూడు రోజుల క్రితం ఓ వ్యకి పైపులు ఎత్తుకెళ్తుండగా చూసిన సిబ్బంది ఎస్అండ్‌పీసీ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో పాటు ఎంవీటీసీ సమీపంలో దొంగలు దాచిన కొంత సామగ్రిని రికవరీ చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై అధికారిని అడిగితే మూడు రోజుల క్రితం ఓ వ్యక్తి పైపును ఎత్తుకెళ్తుండగా చూసి సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం ఇచ్చామని తెలిపారు. ఈ విషయమై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని పలువురు పేర్కొంటున్నారు.

సీహెచ్‌పీని సందర్శించిన డీజీఎంఎస్


పరిశీలిస్తున్న డీజీఎంఎస్

రామకృష్ణాపూర్: రక్షణ తనిఖీల్లో భాగంగా మందమర్రి ఏరియాలోని ఆర్కేపీ సీహెచ్‌పీని ఆదివారం డీజీఎంఎస్ రాజీవ్ ఓంప్రకాష్ వర్మ సందర్శించారు. సీహెచ్‌పీలోని ఎలక్ట్రికల్ విభాగంలో సబ్‌స్టేషన్స్ స్విచ్ స్టేషన్స్, ఇతర మెషినరీని తనిఖీ చేశారు. నూతనంగా నిర్మించిన సబ్‌స్టేషన్‌కు సంబంధించి లోటో, గ్రూప్‌లోటో, నంబర్‌ప్లేట్, డేంజర్ ప్లేట్ తదితర వాటికి రక్షణ సూత్రాలన్నీ కూడా తప్పక పాటించాలని సూచించారు. రక్షణ నియమాలను పాటించటంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండొద్దని సేఫ్టీకి మొదటి ప్రాధాన్యతనివ్వాలని పేర్కొన్నారు. ఏజీఎం నాగరాజు, డీజీఎం బాలాజీ భగవతి, డీవైఎస్ఈ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

వివాహితను హత్య చేసిన వ్యక్తి అరెస్టు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని మండువ గ్రామానికి చెందిన కమ్మరి రోజాను హ త్య నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కాగజ్‌నగర్ ఇన్‌చార్జి డీఎస్పీ సదయ్య, కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు తెలిపారు. వారి వివరాల ప్రకారం... మండువ గ్రామానికి చెందిన రోజాకు గతంలో వివాహమై విడాకులు తీసుకుని తల్లి దండ్రులతో కలిసి ఉంటుంది. ఈ క్రమంలో రోజా కు నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.13కు చెందిన సాగర్ మండల్‌తో పరిచయం ఏర్పడింది. గత ఏడాదిగా రోజాను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మాయమాటలు చెప్పి ఆమెతో ప్రేమాయాణం కొనసాగించా డు. సాగర్‌కు పెళ్లి సంబంధాలు వస్తుండడంతో ఈ విషయం తెలుసుకున్న రోజా ఫిబ్రవరి 28న సాగర్‌ను ఇంటికి పిలిపించుకుని నిలదీసింది. దీంతో ఇ ద్దరి మధ్య గొడవ జరిగింది. రోజా బతికి ఉంటే త న పెళ్లికి అడ్డు పడుతుందని భావించి ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. ఈ మేరకు నిందితుడిపై హ త్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్‌ల కింద కేసు నమో దు చేసి అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

మందు బాబులకు అడ్డాగా.. సెగ్రిగేషన్ షెడ్డు!



దండేపల్లి: చెత్తను వేసేందుకు గ్రామాల్లో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. దండేపల్లి మండలం గుడిరేవులో గల సెగ్రిగేషన్ షెడ్డు మందు బాబులకు అడ్డాగా మారింది. పంచాయతీ అధికారులు స్పందించి లోపలికి ఎవరూ వెళ్లకుండా గేటు ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు ఆటల పోటీలు


బహుమతులు ఇస్తున్న నాయకులు, నిర్వాహకులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలోని సింగరేణి తిలక్ క్రీడా మైదానంలో శనివారం ఆటల పోటీలు నిర్వహించారు. తిలక్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ (55ఏళ్ల పైబడిన వారు)కి ఆటలు పోటీలు నిర్వహించారు. 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెం, 800 మీటర్ల నడక, షాట్‌పుట్ పోటీలు నిర్వహించగా సీనియర్ సిటీజన్స్ ఉత్సాహంగా పాల్గొని తమ సత్తాను చాటారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి దాత గైని అన్నపూర్ణమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు పంపిణీ చేసిన బహుమతులను, మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాతరి స్వామి, గెల్లి జయరాంలు ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ సిటీజన్స్ ఆటల పోటీలు నిర్వహించడం చాలా గొప్ప కార్యక్రమం అన్నారు. ఆటలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో తిలక్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం రాజం, ప్రధాన కార్యదర్శి రంగ రామన్న, సభ్యులు జి.నగేష్, కె.విద్యాసాగర్, వెంకటరాజం, రమేష్, రత్నం ఐలయ్య పాల్గొన్నారు.

గాంధారిఖిల్లాలో 'రాప్లింగ్'


రాప్లింగ్ చేస్తున్న యువకులు, చిన్నారులు

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులోని గాంధారిఖిల్లాలో యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాప్లింగ్ నిర్వహించారు. అటవీ శాఖ సహకారంతో తెలంగాణ అడ్వెంచర్స్ క్లబ్ నిర్వాహకులు రంగారావు స్థానికులకు రాప్లింగ్‌పై అవగాహన కల్పించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తాడు సహాయంతో గుట్టలు ఎక్కి అబ్బురపరిచారు. భవిష్యత్తులో వివిధ అడ్వెంచరీ క్రీడల కోసం పరిశీలనలో భాగంగా గాంధారి గుట్టలో రాప్లింగ్, ట్రెకింగ్, క్లైంబింగ్, జుమారింగ్ వంటివి నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ అడ్వెంచరీ కన్నీబాయి, వైహెచ్ఏ వైస్‌ప్రెసిడెంట్ శ్యాంసుందర్‌రెడ్డి, యూనిట్ సభ్యులు చంద్రమౌళి, రవి తదితరులు పాల్గొన్నారు.